



కేఆర్ స్టేడియంలోని ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న సైకత శిల్పం



'రన్ ఫర్ శ్రీకాకుళం' ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు



ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల వేషధారణ

వజ్రోత్సవ సందడి

- ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు ప్రారంభం
- ఉత్సాహంగా 'రన్‌ఫర్ శ్రీకాకుళం' ర్యాలీ
- జిల్లా 75ఏళ్ల ప్రస్థానాన్ని యువత తెలుసుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. వజ్రోత్సవ సందడి నెలకొంది. బుధవారం శ్రీకాకుళంలో జిల్లా ఆవిర్భావ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల వద్ద 'రన్‌ఫర్ శ్రీకాకుళం' ర్యాలీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. ఏడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, జిల్లావాసులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు దేశనాయకుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అలాగే కేఆర్ స్టేడియంలో స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. 'రన్‌ఫర్ శ్రీకాకుళం' ర్యాలీ ప్రారంభం సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయింది. ఇన్నేళ్ల జిల్లా ప్రస్థానం, చరిత్ర, అభివృద్ధిని యువత తెలుసుకోవాలి. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. జిల్లా ఆవిర్భావ వేడుకలు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముగుస్తాయి. కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించే ఎగ్జిబిషన్‌ను అందరూ సందర్శించాలి. జిల్లా ఔన్నత్యాన్ని తెలుసుకునేందుకు భావితరాలకు ఇది మంచి అవకాశమ'ని తెలిపారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'వజ్రోత్సవం.. జిల్లా చరిత్ర, (మిగతా 6వ పేజీలో..)

కాలగమనంలో ఎన్నోపేర్లు.. శ్రీకాకుళంగానే పదిలం

- అప్పట్లో నవాబుల ప్రభావం అధికం

ఎచ్చెర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నేడు జిల్లా కేంద్రం. కానీ ఒకప్పుడు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలో ఉండేది. కాలక్రమేణా శ్రీకాకుళం ఎన్నో రూపాంతరాలు చెందింది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నవాబుల ప్రభావం ఎక్కువగా ఉండేది. శ్రీకాకుళం గుల్షానాబాద్‌గా పిలవబడేది. ఆ తర్వాత శిఖాఖోల్, సిక్కోఖోలుగా పిలిచేవారు. మహమ్మదీయుల పాలనలో సామంతులు చెల్లించిన కప్పం మూటల శిఖలు విప్పి నవాబులకు ఆ మొత్తాన్ని పంపే కార్యక్రమం పెద్ద మసీదులో జరిగేదని పెద్దలు చెబుతారు. ఆ కార్యక్రమాన్నే శిఖాఖోల్, సిక్కోఖోల్ అనేవారు. సిక్కా అంటే నాణేలు, ఖోల్ అంటే మూటలు విప్పటం. సిక్కాఖోల్ వీటిలోంచి ఉద్భవించిందే. ఈ పదం కాలక్రమంలో చిక్కోలుగా మారి.. వ్యవహారికంగా శ్రీకాకుళంగా స్థిరపడింది. జిల్లాకేంద్రానికి శివారు ప్రాంతాల్లో షేర్‌మహమ్మద్ పురం, ఫరీద్‌పేట, పీరుసాహెబ్‌పేట, అఖింఖాన్‌పేట, ఫాజుల్‌బేగ్‌పేట, బాకర్‌సాహెబ్‌పేట, బాదుర్లపేట, హయాతినగర్, ఇలిసిపురం, హతీగల్లీ(ఏనుగుల మహల్) తదితర ప్రాంతాలు నవాబుల ప్రభావానికి తార్కాణాలు. ఇప్పుడు మనం చూస్తున్న నగర శివార్లు ఎంతో మార్పు చెందాయి. నగరంలోని కత్తెరవీధి సాయిబులతోట గోర్జి. గొంటివీధి, ప్రకాశ్‌నగర్‌కాలనీ కలిసి సాయిబుల తోటగా పిలవబడేది. న్యూ కాలనీలో బుర్రావారితోట కూడా పెద్దగా జనసంచారం ఉండేది కాదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఆర్ట్స్) వెనుక, ముందుభాగంలో మామిడి, జీడి మామిడి తోటలు ఎక్కువగా ఉండేవి. జిల్లెడిమూడివారి, పుప్పాలవారి, ఆర్టీసీ కాంప్లెక్స్, శాంతినగర్ కాలనీలు కూడా జన సంచారం తక్కువగానే ఉండేవి. పట్టణ శివారులో బలగ, అరసవల్లి, ఖాజీపేట, కొత్తపేట గ్రామాలు ఉండేవి. ఒకప్పటి శ్రీకాకుళం నగరానికి ఇప్పటి పరిస్థితిని గమనిస్తే చాలా రూపురూఖలు మారిపోయాయి. భౌగోళికంగా నగర విస్తీర్ణం పెరిగిపోయింది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రాంతాలు నేడు శ్రీకాకుళం నగరంతో కలిసిపోయాయి.

గుజరాతీపేట ఎలా ఏర్పడిదంటే..

నగలు, వజ్రాలు వ్యాపారం నిమిత్తం గుజరాత్ నుంచి వచ్చిన ఠాకూర్, దాస్ కుటుంబాలు ఏడురోడ్ల జంక్షన్ సమీపంలోని పాత వంతెనకు (మిగతా 6వ పేజీలో..)



ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్

అప్పట్లో.. విద్య అంతంతే

- జిల్లా అక్షరాస్యత 20 శాతంలోపే
- ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రక్షాళన
- చంద్రబాబు హయాంలో మరిన్ని విద్యాసంస్థలు

6లో



లక్ష్మీపురం జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా

టోల్ చార్జి.. ఏడాదికి రూ.3వేలు మాత్రమే

- రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమలు
- ఏ టోల్‌గేటు నుంచైనా రాకపోకలకు అవకాశం
- మినహాయింపుతో వాహనదారులకు ఊరట

పలాస, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పలాస నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే లక్ష్మీపురం (పలాస), మడపాం(నరసన్నపేట), నాతవలస(పూసపాటిరేగ) వద్ద ఉన్న మొత్తం మూడు టోల్‌గేట్లు దాటాలి. ఇందుకు మొత్తం ఒకసారి రానుపోను టోల్‌గేట్లు చార్జీలకు రూ.600 వరకూ వాహనదారులకు ఖర్చవుతోంది. ఈ లెక్కన జిల్లాలో చాలామంది వాహనదారులపై టోల్ భారం పడుతోంది. ఈ నేపథ్యంలో టోల్ భారం తగ్గించేలా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఏడాదికి కేవలం రూ.3వేలు చెల్లిస్తే చాలు.. ఒక్క విశాఖపట్నం వరకే కాదు దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం టోల్‌గేట్లలో ఎటువంటి రుసుం చెల్లించకుండా ప్రయాణించేలా అవకాశం కల్పించనుంది. ఈ నెల 15 నుంచి ఈ విధానం అమలు చేయనున్నట్టు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టోల్‌చార్జీల మినహాయింపుతో ఉద్యోగ, వ్యాపారం, సొంత అవసరాల కోసం జాతీయరహదారిపై ప్రయాణించేవారికి ఊరట కలుగనుందని పేర్కొంటున్నారు.

- వార్షిక పాస్ పేరుతో ఈ పథకాన్ని ఫాస్ట్‌ట్యాగ్ వినియోగించే వారికి ఉపయోగపడుతుంది. దీన్ని రాజ్‌మార్గ్‌యాత్ర అనే మొబైల్ యాప్ లేదా జాతీయరహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు డేటాబేస్‌లో నమోదై ఉండాలి. వాహనాలకు అనుసంధానం చేసిన ఫాస్ట్‌ట్యాగ్ వివరాలు, రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా మొబైల్ యాప్/వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. నగదు చెల్లించిన రెండు మూడు గంటల్లోగా వార్షిక పాస్ అమలులోకి వస్తుంది. ఇవన్నీ కేవలం ప్రైవేటు వాహనాలకు మాత్రమే. ట్యాక్సీలు, కమర్షియల్ వాహనాలు, ప్రభుత్వ వాహనాలకు ఈ నిబంధన వర్తించదు. ఒక వాహనానికి జారీచేసిన ఫాస్ట్‌ట్యాగ్ మరో వాహనానికి వర్తించదు. వాహనాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మేరకే రిజిస్ట్రేషన్ నెంబర్ల ఆధారంగా వీటిని జారీ చేస్తారు. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న ప్రైవేటు వాహనాలకు టోల్‌మినహాయింపుతోపాటు రూ.వేలల్లో నగదు ఆదా అయ్యే అవకాశం ఉంది.



వచ్చేస్తోంది స్త్రీ శక్తి

- ఐదు ఆర్టీసీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి అమలు
- ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల
- ఆకతాయిలతో ఇబ్బంది లేకుండా కండక్టర్లకు బాడీవార్న్ కెమెరాలు

శ్రీకాకుళం/కాశీబుగ్గ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్త్రీ శక్తి పథకం అమలుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 15 నుంచి ఈ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. బస్సుల్లో రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. పటిష్ట భద్రత ఉండేలా కండక్టర్లకు బాడీవార్న్ కెమెరాలను కూడా ప్రభుత్వం సమకూర్చింది. జిల్లావ్యాప్తంగా శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, టెక్కలి, పలాస డిపోల్లో 310 బస్సులు ఉన్నాయి. ఇందులో 250 ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించారు. త్వరలో మరో యాభై విద్యుత్ బస్సులు జిల్లాకు రానున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. అలాగే సోంపేట, పలాస, పాతపట్నం, కొత్తూరు, ఆమదాలవలస, టెక్కలి, నరసన్నపేట మార్గాల్లో కూడా ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. దాదాపు అన్ని పట్టణాల మీదుగా (మిగతా 6వ పేజీలో..)

ఉపశమనం



మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత రవాణా చాలా మేలు చేస్తుంది. ఎక్కడికి వెళ్లాలన్నా రవాణా చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. ఉపశమనం కలిగించేలా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

-బదాడ భారతి, కాశీబుగ్గ

రుణపడి ఉంటాం



ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే రవాణా ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది. మాలాంటి వారి జీవనోపాధికి ఇది మంచి నిర్ణయం. ప్రభుత్వానికి మహిళలు రుణపడి ఉంటారు.

-సవర కళావతి, పెంటిభద్ర, కాశీబుగ్గ

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేయనున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఎన్నికల హామీని నిలబెట్టుకోవడం హర్షనీయం.

-కె.భాను, పలాస

ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం ఇచ్చింది. మరోవైపు సిబ్బందికి డెమో శిక్షణ కూడా ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేస్తాం.

-హనుమంతు అమరసింహుడు,
ఇన్‌చార్జి ప్రజా రవాణా అధికారి, శ్రీకాకుళం

భిక్షగాళ్లగా తిరిగి.. తాళం వేసిన ఇళ్లను గుర్తించి..

- దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

సినీ ఫక్కీలో చోరీ

- పార్వతీపురంలో తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ మోసం
- కారులో వచ్చి రూ.12లక్షలతో పరారీ
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

గంజాయితో నలుగురి అరెస్టు

- 24.5 కిలోల నిల్వలు స్వాధీనం

8లో

అంతా గజిబిజి

- 'చీపురుపల్లి'లో సక్రమంగా లేని భూముల సర్వేనెంబర్లు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- ఆందోళనలో రైతులు..
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



చీపురుపల్లి పంచాయతీ భూములు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీలోని భూముల్లో సర్వేనెంబర్లు గజిబిజిగా ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో ఎం.గడూరు, అనకాపల్లి, డెప్పూరు, కొండపల్లి, సంతోష్ నగర్, సందిపురం గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకూ ఈ పంచాయతీలో భూములకు ఎలాంటి సర్వే చేయలేదు. కొన్ని సర్వే నెంబర్లకు అడంగల్‌లు రాలేదు. ఒక సర్వే నెంబర్ భూమిలో మరొకరి పేరు ఉంది. భూమి ఆధీనంలో ఉన్నా విస్తీర్ణం తక్కువగా చూపిస్తోంది. ఇలా పలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని చీపురుపల్లి పంచాయతీలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. కొన్ని భూముల సర్వే నెంబర్లు పూర్వీకుల పేరుపై ఉన్నాయని, వాటిని వారసుల పేర్లకు మార్పు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో అన్నదాత సుఖీభవ పథకానికి దూరమవుతున్నామని వాపోతున్నారు. అలాగే ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నా.. సర్వే నెంబర్లు గజిబిజి వలన భూములను విక్రయించుకోలేక పోతున్నామని పేర్కొంటున్నారు.

- గతంలో చీపురుపల్లి పంచాయతీ భూముల రిజిస్ట్రేషన్లు ఏడాదిపాటు నిలిచిపోయాయి. దీంతో అత్యవసరమైనా భూములు విక్రయించుకోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. చాలామంది ఖర్చులకు డబ్బులు లేక.. పెళ్లిళ్లు సైతం వాయిదా వేసుకున్నారు. దీనిపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించగా అధికారులు స్పందించి.. భూముల రిజిస్ట్రేషన్ కొనసాగించారు. తాజాగా ఈ పంచాయతీ భూముల్లో సర్వే నెంబర్లు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఇదిలా ఉండగా జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికిగానూ అధికారులు చీపురుపల్లి పంచాయతీ ప్రాంతంలో కూడా భూములను పరిశీలిస్తున్నారు. ఎయిర్‌పోర్టుకు తుదిరూపం వస్తే (మిగతా 6వ పేజీలో..)

చివరి నిమిషంలో ప్లాట్‌ఫారం మార్పు

- పరుగులు తీసిన రైల్వే ప్రయాణికులు
- వర్షంలో తడిసిన వైనం
- గూడ్స్‌కి ఇచ్చిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై అసహనం

6లో

ముగ్గురు రిటైర్డ్ అధికారులపై పునర్విచారణ

- రోడ్డు విస్తరణ, కాలువ పనుల్లో అవకతవకలే కారణం

7లో

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి

- జిల్లావ్యాప్తంగా తిరంగా ర్యాలీలు

7లో

అప్పట్లో విద్య అంతంతే



జిల్లా అక్షరాస్యత 20 శాతంలోపే

ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రక్షాళన

చంద్రబాబు హయాంలో మరిన్ని విద్యాసంస్థలు

ఎచ్చెర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్రం వచ్చిన మూడేళ్ల తర్వాత శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించింది. అంతకుముందు ఒడిశాలోని గంజాం జిల్లాలో ఉండేది. 1979లో విజయనగరం జిల్లా ఏర్పాటయ్యే వరకు.. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాలు శ్రీకాకుళం జిల్లాలోనే ఉండేవి. మూడేళ్ల క్రితం వైసీపీ పాలనలో మరోసారి జిల్లా విభజనకు గురైంది. రాజాం, పాలకొండ ప్రాంతాలు ఈ జిల్లా నుంచి పక్క జిల్లాల్లోకి చేరాయి. జిల్లా ఆవిర్భావం నాటికి విద్యారంగ పరిస్థితిని అవలోకనం చేస్తే...



స్వర్ణోత్సవాలు పూర్తిచేసుకున్న శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఆనాడు ఉండేవి ఎయిడెడ్ స్కూల్సే

1940 ప్రాంతంలో ఎయిడెడ్ స్కూల్స్ ఉండేవి. వాటికి మేనేజర్ వ్యవస్థ ఉండేది. అప్పట్లో ఆరో ఏటనే పాఠశాలలో చేరేవారు. చదవడం, రాయడం, అక్షరమాలతో పరిచయం - రెండేళ్ల పాటు ఒకటో తరగతిలోనే గడిచిపోయేది.

విద్యా సంవత్సరం జనవరిలో ప్రారంభమై డిసెంబరుతో ముగిసేది. గణిత బోధిని, పెద్దబాలశిక్ష, తరగతి వారీగా తెలుగు వాచకం ఉండేవి. తరగతికి ఒకరు చొప్పున బోధించేవారు. పేదవర్గాల పిల్లలు బడికి దూరంగానే ఉండేవారు. 1953 నాటికి ఎలిమెంటరీ ఉపాధ్యాయుల జీతం నామమాత్రమే. ఇందులో మేనేజర్‌కు మూడో వంతు ఇవ్వాలి. స్వాతంత్ర్యానికి పూర్వమే జిల్లాలో ఎయిడెడ్, జిల్లా బోర్డులు, మునిసిపాల్టీలు, మిషనరీ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు ఉండేవి. ఎయిడెడ్ పాఠశాలలకు గ్రాంట్లు సరిగా వచ్చేవికావు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లోయర్ గ్రేడ్ టీచర్‌కు జీతం నెలకు రూ.9, హయ్యర్ గ్రేడ్‌కు రూ.14, సెకండరీ గ్రేడ్‌కు రూ.18 ఉండేది. ఈ కొద్దిపాటి జీతంలో 15 శాతం మేనేజ్‌మెంటు తీసుకునేది. మద్యపాన నివారణ, ఆదివారం, వర్కర్ల చందా పేరిట జీతంలో రూ.4 మినహాయించేవారు. 1947 నాటికి ఆనాటి వేతన స్కేల్ ప్రకారం ఉపాధ్యాయులు గరిష్ఠ వేతనస్థాయికి ఆరేళ్లలో చేరుకునే వారు. ఆ తర్వాత పదవీ విరమణ వరకు జీతం పెరిగేది కాదు. 1960లో విరివిగా మిడిల్ స్కూల్స్, హైస్కూల్స్ ప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు ఉండని పరిస్థితి. ఒకనాటి ఎయిడెడ్ విద్యావ్యవస్థ, జిల్లా బోర్డుల వ్యవస్థ కాలక్రమేణా పంచాయతీరాజ్‌లో విలీనమయ్యాయి. నిరక్షరాస్యతను నివారించేందుకు ఆనాడు వయోజన విద్య, రాత్రిబడులు నిరంతరం పనిచేశాయి.

అంతంతమాత్రంగానే విద్యా సౌకర్యాలు

1975 నాటికి అక్షరాస్యత 20 శాతానికి మించిలేదని



గణాంకాలు చెబుతున్నాయి. అక్కడక్కడే ప్రాథమిక పాఠశాలలు, ఎయిడెడ్, బోర్డ్ స్కూల్స్ ఉండేవి. ఆ తర్వాత ఇవి సమితి పాఠశాలలుగా, టీడీపీ పాలనలో మండల పరిషత్ పాఠశాలలుగా అవతరించాయి. నేడు మండల, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ, మిషనరీ స్కూల్స్, కేజీబీవీ, ఆదర్శ, ఏపీ గురుకుల పాఠశాలలు, అంబేడ్కర్ గురుకులాలు, గిరిజన గురుకులాలు ఇలా చాలా వెలిశాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో విద్యారంగానికి ప్రాధాన్యం పెరిగింది. ఎస్ఎంపురం, వమరవల్లిలో ఏపీ గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు/కళాశాలలు ఏర్పడ్డాయి. మొదట్లో ఇంటర్మీడియట్ విద్య ఎక్కడో ఉండేది. నేడు ప్రతి మండలంలో కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రతి మండలంలో కస్తూర్బా బాలికా పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలు ఉన్నాయి.

ఇంజనీరింగ్, వైద్యం

1977-78 విద్యా సంవ త్సరంలో ఏయూకు అనుబం ధంగా పీజీ సెంటర్ రెండు కోర్సులతో ప్రారంభమైంది. 2008లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పీజీ సెంటర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ (ఎచ్చెర్ల)గా అప్‌గ్రేడ్ అయ్యింది. అలాగే రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) వైద్య కళాశాలను శ్రీకాకుళంలో ఏర్పాటుచేశారు. జెమ్స్ పేరిట మరో వైద్య కళాశాల కూడా ప్రైవేటు రంగంలో నడుస్తుంది. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల కూడా ఏర్పాటైంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో నాలుగు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి.

1951లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1951లో ఏర్పాటైంది. ఈ కళాశాలలో చదివిన ఎంతోమంది ఉన్నతంగా స్థిరపడి సమాజ సేవలో పునీతులయ్యారు. అప్పట్లో ఈ కళాశాలలో ఉద్యోగుల కోసం నైట్ కాలేజీని కూడా నడిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి అనుబంధంగా 14 బీఈడీ కళాశాలలు నడుస్తున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలో గురజాడ బీఈడీ కళాశాల మూడున్నర దశాబ్దాలకు పైగానే సేవలందిస్తోంది. శ్రీకాకుళంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకాక మునుపు విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాల్సి వచ్చేది.

నవ్యాంధ్రలో ట్రిపుల్ ఐటీ

నవ్యాంధ్రలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎస్ఎంపురం కొండపై రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను మంజూరు చేశారు. అలాగే అంబేడ్కర్ వర్సిటీలో, మరో ప్రైవేటు లా కళాశాలలు కూడా ఉన్నాయి. నైరలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఓ కళాశాల నడుస్తోంది. అలాగే ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పురంలో శ్రీ కింజరాపు వ్యవసాయ కళాశాల ప్రైవేటు రంగంలో నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్రలోనే ఎంతోమందికి సాంకేతిక విద్యను అందించిన డీఎల్‌టీసీ శ్రీకాకుళంలో ఏర్పాటు చేయగా, ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎచ్చెర్ల, రాజాం, పలాస, సీతంపేటలో ఐటీఐలు ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. రాష్ట్రంలోనే అతి పురాతనమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల శ్రీకాకుళంలో ఉంది. ఆతర్వాత శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, ఆమదాలవలస, టెక్కలిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు నెలకొల్పారు. సీతంపేటలో తొలుత నవోదయ పాఠశాల నిర్వహించగా, ఆ తర్వాత సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోకి మార్చారు. ఉత్తరాంధ్రలోనే ఎంతో మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ శిక్షణా సంస్థ గార మండలం వమరవల్లిలో 1952 నుంచి నిర్వహిస్తున్నారు.

కాలగమనంలో ఎన్నోపేర్లు..

(ఐదో పేజీ తరువాయి)

అవతల వైపు స్థిరపడ్డారు. దీంతో ఈ ప్రాంతానికి గుజరాతీపేట అని పేరొచ్చింది. గుజరాతీపేట, హయాతీనగరాలను కలుపుతూ సిపాయిల తిరుగుబాటుకు ముందే నిర్మితమైన పాతవంతెన 12ఏళ్ల కిందట వరకు వినియోగంలో ఉంది.

1856లోనే శ్రీకాకుళంలో పాఠశాల

1856లో శ్రీకాకుళంలో తాలుకా స్కూల్ ఆవిర్భవించింది. 1860లో దీనిని ప్రభుత్వ వర్నాక్యులర్ స్కూల్‌గాను, 1878లో జిల్లా స్కూల్‌గాను మార్పు చెందింది. 1979లో గవర్నమెంటు సెకండరీ స్కూల్‌గా, 1885లో పురపాలక సంఘ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందింది. 1891లో ఉమ్మడి మదరాసు ప్రభుత్వంలో గుర్తింపుపొందింది. 1961లో పురపాలక సంఘ బహుళార్థక పాఠశాలగా తొమ్మిదేళ్లపాటు ఇంటర్ స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దింది. 1970లో తిరిగి పురపాలక సంఘోన్నత పాఠశాలగా 1996-97లో నందమూరి తారకరామారావు మునిసిపల్ హైస్కూల్‌గా అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ దూడ భవానీ శంకర్ మార్పు చేశారు. ఎంతోచరిత్ర ఉన్న ఈ పాఠశాలలో శంకర నారాయణ డిక్షనరీ రచయిత పాలూరి శంకరనారాయణ చదువుకున్నారు. వపాగా చరిత్రకెక్కిన చిత్రకారుడు వడ్డాది పాపయ్య ఎంసీగా పేరొంది తొలితరం జర్నలిస్ట్‌గా నిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేసిన మానుకొండ చలపతిరావు, తిమ్మరాజు శివరావు, ఇదే పాఠశాలలో చదివి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి శ్రీకాకుళం మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించిన శెట్టి పూర్ణయ్య పంతులు, బెండి శ్రీరామ్మూర్తి (తోటాడ), చౌదరి సత్యనారాయణ (ఎస్ఎంపురం).. ఇలా చాలామంది ఈ పాఠశాలలో చదివి.. ఉన్నతస్థాయికి ఎదిగారు. వీరంతా స్వాతంత్ర్యోద్యమంలో తమవంతు భాగస్వామ్యమయ్యారు.

● మద్రాసు యూనివర్సిటీ నుంచి తెలుగు సాహిత్యంలో తొలి పీహెచ్‌డీ చేసి, రాయలసీమకు ఆ పేరును ప్రతిపాదించిన చిలుకూరి నారాయణరావు (జి.సిగడాం మండలం ఆనందపురం) కూడా ఇదే పాఠశాలలో చదివి.. కొన్నాళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతపురంలో స్థిరపడిన నారాయణరావు పేరిట ఆ పట్టణంలో ఓవీధికి చిలుకూరి మార్గ్ పేరు పెట్టారు. శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి ఆరుసార్లు ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావు, తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా పనిచేసిన నాయన కృష్ణకుమారి, ప్రముఖ శిల్పి పుల్లేటికుర్తి వీరభద్రరావు, సినీనటుడు రావికొండలరావు, దూసి బెనర్జీ, నాటక రచయిత మల్లాది వెంకట కృష్ణశర్మ, మల్లాది విశ్వనాథకవి, డిటెక్టివ్ నవలా రచయిత జగన్నాథకవి ఇక్కడ చదువుకున్నవారే. ఐఏఎస్‌లుగా పనిచేసిన గోనెల బ్రదర్స్, ఈమని అనంత సత్యనారాయణ శర్మ, బీహెచ్‌ఈఎల్ మాజీ చైర్మన్ బొంతా ప్రసాద్, విశ్రాంత ఐజీ మెట్ట రాధాకృష్ణ, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ ఇదే పాఠశాలలో చదువుకున్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రండి

భూ సమస్య లేదు.. అనుమతులు వెంటనే ఇస్తాం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'పరిశ్రమల స్థాపనకు ముందుకు రండి. అన్నివిధాలా సహకరిస్తాం' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తల సదస్సు బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో భూ సమస్య లేదు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు సమర్పిస్తే ఏపీఐఐసీ ద్వారా భూములు కేటాయిస్తాం. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు ఆరు లేన్ల రహదారి నిర్మాణం సాగుతోంది. జిల్లాలో 193 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. ఆయా కారిడార్ల వెంబడి పరిశ్రమలు నెలకొల్పితే ఆదాయంతో పాటు, జిల్లా అభివృద్ధికి, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోండి. పలాసలో జీడిపప్పు ఉత్పత్తులు, తీరప్రాంతంలో ఆక్వా ఉత్పత్తులు, అలాగే అధికంగా లభించే మామిడి, పనస, జీడిమామిడి తదితర ఉత్పత్తులకు విలువలను జోడిస్తే నాణ్యమైన ఉత్పత్తులను తయారుచేయవచ్చు. భూమి కేటాయింపు పారదర్శకంగా, అవసరమైన మేరకు చేస్తాం. ప్రభుత్వ ఖాళీ భవనాలను కూడా తాత్కాలికంగా కేటాయిస్తాం. అలాగే ప్రైవేటు భూముల కొనుగోలుకు సహకారమందిస్తాం' అని అన్నారు.

● శాసనసభ్యుడు గొండు శంకర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనలో జిల్లా తొలి 5 స్థానాల్లో ఉండాలన్నారు. సెప్టెంబరు నాటికి మూలపేట పోర్టు పూర్తయ్యే అవకాశం ఉందని, కార్గో టెర్మినల్ ఏర్పాటుకు అధ్యయనం జరుగుతోందని అన్నారు. అలాగే కళింగపట్నం పోర్టులో పాసింజర్ జెట్టీ, మరో రెండు మినీ జెట్టీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఐసీ జీఎం జిఎం.శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్ఎం మురళీమోహన్, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, 50 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు



ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలిస్తున్న సాగరమాల ప్రాజెక్ట్ ప్రతినిధులు, ఏపీ మారిటైమ్ ఇంజనీరింగ్ బృందం

ఫిషింగ్ హార్బర్ స్థల పరిశీలన

ఎచ్చెర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని బుధవారం సాగరమాల ప్రాజెక్ట్ ప్రతినిధులు, ఏపీ మారిటైమ్ బోర్డు ఇంజనీరింగ్ బృందం పరిశీలించింది. గతంలో రూపొందించిన అంచనాల మార్పుపై క్షేత్రస్థాయిలో ఈ బృందం పర్యటించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల ఈ గ్రామాన్ని సందర్శించి తీరాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. అంచనాల మార్పుల వల్ల కలిగే ప్రభావాన్ని స్థానిక మత్స్యకారులతో బృందం సభ్యులు చర్చించారు. హార్బర్ పనులను సత్వరమే ప్రారంభించి త్వరితగతిన పూర్తికి చర్యలు చేపడితే ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మత్స్యకారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏపీ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మశ్రీ, తమ్మారావు, ఎఫ్‌డీవో రవికుమార్, స్థానిక సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, స్థానిక మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు పాల్గొన్నారు.

జిల్లా సంస్కృతిని ప్రతిబింబించేలా ఎగ్జిబిషన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ ఎగ్జిబిషన్ బుధవారం స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్ ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా సంస్కృతి, చరిత్ర, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు. సాంప్రదాయ హస్తకళలు, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయ పరికరాలు, పర్యాటక ప్రదర్శనలు, విద్యా విభాగం ప్రాజెక్టులు, ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయన్నారు. యువత, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 15వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. సైకత శిల్పం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

అంతా గజిబిజి

(ఐదో పేజీ తరువాయి)

భూముల సర్వేనెంబర్లు గజిబిజి వలన ప్రభుత్వం ఇచ్చే పరిహారం కూడా తమకు దక్కే అవకాశం ఉండదని కొంతమంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వే నెంబర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. తమ భూముల్లో సర్వే చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

చీపురుపల్లి పంచాయతీ భూముల్లో సర్వేనెంబర్ల సమస్యను పరిష్కరించాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. సర్వే నెంబర్లు గజిబిజి వలన ప్రభుత్వ పథకాలు రైతులకు అందడం లేదు. పంచాయతీలో పూర్తిస్థాయి సర్వే చేసి.. సర్వేనెంబర్లలో గందరగోళం తొలగించాలి.

-సాతుపల్లి కామేశ్వరరావు, ఎం.గడూరు

సమస్యను పరిష్కరిస్తాం

ఫిర్యాదులు వచ్చిన భూములకు సంబంధించి రీ సర్వే చేస్తున్నాం. చీపురుపల్లి పంచాయతీలో రీ సర్వే జరగలేదు. చలానా చెల్లించిన భూములకు సచివాలయం సర్వే బృందంతో మండల సర్వే బృందం కలిసి సమస్యకు పరిష్కారం చూపుతున్నాం.

- కె.తిరుపతిరావు, మండల సర్వేయర్, వజ్రపుకొత్తూరు

రీ సర్వే చేస్తాం

చీపురుపల్లి పంచాయతీల్లో భూములకు రీ సర్వే ప్రారంభిస్తాం. ఈ ప్రక్రియలో సర్వే నెంబర్లు సరిచేసే అవకాశం ఉంది. రైతులు సమస్యలను రీ సర్వే సమయంలో చెప్పుకోవచ్చు.

- ప్రసాద్, వీఆర్వో, చీపురుపల్లి

వచ్చేస్తోంది 'స్త్రీ శక్తి'

(ఐదో పేజీ తరువాయి)

విశాఖకు రాకపోకలు సాగించే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు జిల్లాలో అంతర్గతంగా ప్రయాణించే మహిళలకు ప్రయోజనం దక్కనుంది. మహిళల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు.. విద్యార్థినులు, చిరుద్యోగులు, మహిళా కూలీలు.. ఇలా అందరికీ ఉచిత బస్సు ప్రయాణం వర్తించనుంది. జిల్లాలో సుమారు రోజుకు 20వేల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది.

● ఐదు సర్వీసుల్లో వెసులుబాటు..

సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు మొత్తం ఐదు ఆర్టీసీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రయాణం చేసే మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు.. ఇలా ఎవరైనా ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు.. ఇలా తదితర ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి కండక్టర్లకు చూపించాలి. ప్రయాణ సమయంలో మహిళలకు ఆర్టీసీ కండక్టర్లు జీరో టికెట్ ఇస్తారు. ఇందుకు అయ్యే ఖర్చు ఏపీఎస్ ఆర్టీసీకి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. అలాగే విద్యార్థినులకు ఇక బస్‌పాస్‌లు రెన్యువల్ లేకుండా వీలు కలుగుతుంది. ఉచిత ప్రయాణం కారణంగా ఒక్కసారిగా బస్సుల్లో రద్దీ పెరగనుంది. ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బస్సుల్లో భద్రత దృష్ట్యా ఆకతాయిల నుంచి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు కండక్టర్లకు బాడీవార్న్ కెమెరాలు ప్రభుత్వం అందజేయనుంది.

● ఈ బస్సుల్లో వర్తించదు..

మహిళలకు కొన్ని బస్సుల్లో ప్రయాణం వర్తించదు. నాన్‌స్టాప్ సర్వీసులు, ఇంటర్ స్టేట్‌బస్సులు, కాంట్రాక్ట్ క్యారేజీ, చార్టర్డ్, ప్యాకేజీ టూర్లు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ తోపాటు అన్ని ఏసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలుపడదు.

వజ్రోత్సవ సందడి

(ఐదో పేజీ తరువాయి)

సంస్కృతి, ఐక్యతకు ప్రతీక. జిల్లా మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా'నని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 'దేశభక్తి శ్రీకాకుళం వారసత్వంలోనే ఉంది. 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను దాటుకుని నేడు జిల్లా ఈ స్థితికి చేరుకుంది. ఎందరో మహనీయుల కృషి, త్యాగాలు వెలకట్టలేనివి. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాం. పండుగ వాతావరణంలో ఉత్సవాలు ప్రారంభం కావడం, వందలాదిగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. రానున్న రోజుల్లో జిల్లాను సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చివరి నిమిషంలో ప్లాట్‌ఫారం మార్పు

● పరుగులు తీసిన రైల్వే ప్రయాణికులు ● వర్షంలో తడిసిన వైనం

● గూడ్స్‌కి ఇచ్చిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై అసహనం



సామగ్రితో పరుగులు తీస్తున్న ప్రయాణికులు, కళాసీలు



కనీస సౌకర్యాలు లేని ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంలో ఆగిన రైలు ఎక్కేందుకు వర్షంతో వెళ్తున్న ప్రయాణికులు

పలాస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో ప్రయణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో రెండో నెంబరు ప్లాట్‌ఫారానికి చేరాల్సిన రైలును చివరి నిమిషంలో ఎటువంటి సౌకర్యాలు లేని ఒకటో నెంబరు ప్లాట్‌ఫారానికి మార్పు చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు, వికలాంగులు ఈసురోమంటూ ఒకటో నెంబరు ప్లాట్‌ఫారానికి వెళ్లి రైలు ఎక్కారు. వివరాల్లోకి వెళ్తే.. పూరి-అహ్మదాబాద్ సూపర్‌ఫాస్ట్ రైలు మంగళవారం రాత్రి 9.56 గంటలకు రావాల్సి ఉంది. సాంకేతిక కారణాల వల్ల ఈ రైలు రాత్రి 11 గంటలకు వచ్చింది. ఇది రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై నిలుపుదల చేయాల్సి ఉంది. ఈ రైలుకోసం వేచి ప్రయాణికులంతా వేచి ఉన్నారు. ఈ క్రమంలో బొగ్గుతో విశాఖ వైపు వెళ్త గూడ్స్ రైలు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై నిలుపుదల చేశారు. వాస్తవానికి గూడ్స్ రైళ్లను ఒకటి, దానికి పక్కనే ఉన్న ఒకటి-ఏ ప్లాట్‌ఫారంలో నిలుపుదల చేస్తుంటారు. దీనికి విరుద్ధంగా రైల్వే అధికారులు రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై గూడ్స్‌ను నిలుపుదల చేశారు. దీనిని పంపించి ప్రయాణికుల కోసం వస్తున్న రైలు అవకాశం ఇవ్వాల్సి ఉన్నా రైల్వే అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అహ్మదాబాద్ రైలు వస్తున్నట్టు ప్రకటిస్తూ ఎటువంటి సౌకర్యాలు లేని ఒకటో నెంబరు ప్లాట్‌ఫారాన్ని కేటాయించారు. ఇదే సమయంలో వర్షం కురవడంతో ప్రయాణికులు తడుచుకుంటు బ్రిడ్జిపై నుంచి ఒకటో నెంబరు ప్లాట్‌ఫారానికి చేరుకుని రైలు ఎక్కారు. మొత్తం ఖాళీ ప్లాట్ ఫారం కావడంతో రైలు ఎక్కేందుకు ప్రయాణి కులు అష్టకష్టాలు పడ్డారు. చివరకు రైల్వే సిబ్బంది సైతం అసహనం వ్యక్తం చేయడం విశేషం. ప్రయాణికులు వెళ్లే రైలుకు ప్రాధాన్యం ఇవ్వకుండా బొగ్గుతో వెళ్తున్న రైలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై రైల్వే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తున్నట్టు పలువురు ప్రయాణికులు తెలిపారు.

ఏపీఎంపై దాడి అమానుషం


సోంపేట: నిరసన తెలుపుతున్న వెలుగు సిబ్బంది

ఇచ్ఛాపురం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ఏపీఎం రజనీపై దాడిని ఇచ్ఛాపురం మండల వెలుగు సిబ్బంది ఖండించారు.ఈ మేరకు ఇచ్ఛాపురంలో ఏపీఎం ప్రసాద్, జిల్లా ఏపీఎంల (సెర్ప్-డీఆర్‌డీఏ) సంక్షేమ సంఘ అధ్యక్షుల ఆధర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి దుశ్చర్యను సహించబోమని, అమానుషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షులు ఎస్.ప్రసాద్, సీసీలు మోహన్‌రావు, దాలయ్య, అకౌంటెంట్లు మోహిని, వాణిభవాని, గ్రామ సంఘ సహాయకులు పాల్గొన్నారు.

● సోంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ ఏపీఎం రజనీపై దాడికి పాల్పడినవారిని శిక్షించాలని ఏపీఎం ఎస్.ప్రసాదరావు కోరారు. సోంపేటలో దాడికి నిరసనగా వెలుగు సిబ్బంది బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీసీలు జె.శ్రీనివాసరావు, బి.పాపారావు, పి.గణపతిరావు, టి.శ్రీనివాసరావు, భారతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ముగ్గురు రిటైర్డ్ అధికారులపై పునర్విచారణ

శ్రీకాకుళం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని చినబజారు- ఇల్లిసిపురం రోడ్డు విస్తరణ, వర్షం నీటి కాలువల పనుల్లో అవకవతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై ప్రభుత్వం పునర్విచారణకు ఆదేశించింది. విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జరిగిన పనుల్లో నాణ్యతలేమి,ఆర్థిక అవతవకలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2015 నవంబరులో సమర్పించిన నివేదికలో పలు అంశాలను పొందుపరిచింది.ఈ కేసులో రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శ్యామ్‌సుందర్, రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్, క్యూసీ సెల్ ఏవీ రమణారావు, రిటైర్డ్ చీఫ్ అకౌంట్స్ అధికారి డి.విజయ భారతిపై విచారణ నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు ప్రకారం విచారణ నిర్వహించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ అధికారులపై రాతపూర్వకంగా సమాధానాలను స్వీకరించింది. అయితే ఈ విషయంపై విచారణఅధికారిగా వీఎంఆర్‌డీఏ చీఫ్‌ఇంజనీర్ ఎం.వినయ్‌కు మార్‌ను ప్రభుత్వం తాజాగా నియమించింది. విచారణను రెండు నెలల్లో పూర్తిచేసి నివేదికనుప్రభుత్వానికి సమర్పించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులను జారీచేశారు.

పీఏసీఎస్ చైర్మన్లకు నియామక పత్రాలు

జి.సిగడాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం, బాతువ పీఏసీఎస్ పాలక మండళ్లకు నీఈవోలు అబోతుల పాపినాయుడు, జి.లక్ష్మణరావు బుధవారం నియామక పత్రాలను అందజేశారు. జి.సిగడాం పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు, డైరెక్టర్లు పడాల అప్పన్నమాస్టారు, విక్రం కామేశ్వరరావుకు, బాతువ పీఏసీఎస్ చైర్మన్ నక్క మురళీధరరావు, డైరెక్టర్లు పోతిరెడ్డి సన్యాసిరావు, రెడ్డి సంతోష్‌కుమార్‌కు నియామక పత్రాలను అందజేశారు. వీరి వెంట కామోజులు సీతారాం, సిగటాపు గోవిందరావు ఉన్నారు.

బీఆర్‌ఏయూలో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

ఎచ్చెర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సిబ్బంది, విద్యార్థులకు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. విశాఖ మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని వీసీప్రొఫెసర్ కేఆర్‌రజని ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, ఎస్‌వో డాక్టర్ కె.స్వామ్రాజ్యలక్ష్మి, క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.పాల్, డాక్టర్ హారిక పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎస్.రవిబాబు తెలిపారు. బుధవారం వంజంగిపేటలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టా ఆధ్వర్యంలో ఆర్థికఅక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి లక్ష్మి, సీసీ చంద్రరావు, సీఎఫ్ఎస్ వనజాక్షి, కళాజాత బృందం ఎం.రమేష్, తారక రామారావు పాల్గొన్నారు.

135 మందికి కిడ్నీ పరీక్షలు

సోంపేట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాణిగాంలో బట్టిగళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో బుధవారం 135 మందికి కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. తొలుత 28 మందికి సీకేడీ పరీక్షలు నిర్వహించగా వారిలో నలుగురు కిడ్నీ సమస్య ఉన్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు.

వీడియో పోటీల విజేత శ్రీకాకుళం వెదర్‌మ్యాన్

శ్రీకాకుళం కలెక్టరేట్,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):సిక్కోలు వజ్రోత్సవాల పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం నిర్వహించిన వీడియో పోటీల్లో శ్రీకాకుళం వెదర్‌మ్యాన్ అరవింద్ రూపొందించిన వీడియోకు ప్రథమ బహుమతి లభించింది. ఈమేరకు విజేతలను బుధవారం ప్రకటించారు.హలో సిక్కోలు ప్రశాంత్‌కు ద్వితీయ, ప్రణవ్ తృతీయబహుమతి లభించాయి.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు

స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఏర్పడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్, రన్ ఫర్ శ్రీకాకుళం బృందాల సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కవిటి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు కోరారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో పీవో పాపారావు పాల్గొన్నారు.

రైతులు బీమా చేయించుకోవాలి

కవిటి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్‌లో వరినాట్లువేసిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద శుక్రవారంలోగా బీమా చేయించుకోవాలని ఏవో పి.శ్రీదేవి ఒక ప్రకటనలో కోరారు.బ్యాంకు రుణం పొందిన రైతులు వరిపంటగా ధ్రువీకరించుకొని ప్రీమియం బ్యాంకుద్వారా చెల్లించాలని తెలిపారు.రుణం పొందని రైతులు క్రాప్ సర్టిఫికెట్ పొంది మీసేవలో ఎకరాకు రూ.160లు చొప్పున ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు.

గురుకులాల్లో మార్పులు తీసుకురావాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో సమూల మార్పులు తీసుకురావాలని దళిత, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మాల మహానాడు జిల్లా నాయకులు భైరి ధనరాజ్, రెల్లికులసంఘ నాయకుడు ఆర్జికోటి, ఈశ్వరరావు, టి.రమణ కోరారు.బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1300 సీట్లు భర్తీ కాకుండా ఉండిపోయాయని తెలిపారు.

ఎరువులు అధికంగా వినియోగించవద్దు

ఎల్ఎన్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువులు అధికంగా వినియోగించవద్దని వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.రాజగోపాల్, ఏవో కె.సింహాచలం తెలిపారు.బుధవారం సుమంతాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.పావని, వీపీఏ బి.పద్మజ, సర్పంచ్ నర్సునాయుడు, తూలుగు ప్రసాదరావు, సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో కుండపోత వర్షం

సరుబుజ్జిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, సలంత్రి, రొట్టవలస, బప్పడాం తదితర గ్రామాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. 20 రోజులు నుంచి వర్షం లేకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో వరి పైరు ఎండిపోతోంది. ఈ సమయంలో బుధవారం గంటన్నర సమయం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో అన్నదాతలు ఉపశమనం పొందారు.

ప్రతి ఇంటా జాతీయజెండా ఎగరాలి

● జిల్లా వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు

ప్రతి ఇంటా జాతీయ జెడా ఎగురవేసి దేశ సమగ్రతను చాటి చెప్పాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లావ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

●ఇచ్ఛాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురంలో మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో హర్‌ఘర్‌తిరంగా ర్యాలీ నిర్వహించారు.మునిసిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ జంక్షన్‌కు వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం బస్టాండ్ కూడలిలో మానవ హారం చేపట్టారు.

● రణస్థలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):రణస్థలంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలోహర్‌ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు. రామతీర్థాలు జంక్షన్ నుంచి పలువీధుల గుండా ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

●గార, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గారలో బీజేపీ మండలాధ్యక్షురాలు షైలవల్లి లక్ష్మీజనార్దన్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పండి యోగేశ్వరరావు, ఆరంగి తిరుపతి రావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

●టెక్కలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు తిరంగ్ యాత్ర నిర్వహించారు. ఇందిరా గాంధీ కూడలిలో మానవహారం ఏర్పాటుచేశారు.

● నరసన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, బీజేపీ, సంఘ పరివార్ నాయకులు పాల్గొన్నారు.

● కొత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తూరులో ప్రభుత్వ కళాశాల నుంచి స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి తిరంగర్యాలీ చేపట్టారు.అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరిసింహమూర్తి, భాస్కరరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.



రణస్థలం: హర్ ఘర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

బాలికల జూనియర్ అథ్లెటిక్స్‌చాంపియన్‌షిప్ కైవసం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలికల విభాగంలో ఇటీవల చీరాలలో జరిగిన 36వ జూనియర్స్ అథ్లెటిక్స్‌లో పోటీల్లో 26 పతకాలతో చాంపియన్‌సిప్‌ను కైవసం చేసుకున్నారు. ఇక్కడ జరిగిన అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన బాలబాలికలు పతకాల సాధించి సత్తాచాట్టారు. ఈమేరకు జిల్లా క్రీడాకారులు 14 బంగారు, రజతాలు తొమ్మిది, కాంస్య పతకాలు మూడు సాధించారు. ట్రాయాథ్లెన్‌లో ఆర్.పవిత్ర, హైజంప్‌లో పి.యశ్వితకు ప్రథమ స్థానం, జావెలిన్‌లో ఎ.పూర్ణిమ, టి.తరుణ్‌లు స్వర్ణాలు, రేస్‌వాక్, లాంగ్‌జంప్‌లో ఎం.శృతికి రెండు స్వర్ణాలు, 200, 400 మీటర్ల పరుగులో వి.రాజేష్‌కు రెండు స్వర్ణాలు, హైజంప్‌లో ఎల్..కల్పనకు స్వర్ణం, కిడ్స్ జావెలిన్‌లో హిదూమ్ సుజకు స్వర్ణం, విష్ణువర్ధన్‌కు రజితం, షాట్‌పుట్‌లో మదన్ యాదవ్‌కు రజితం,జావెలిన్‌లో ఎం.మోహినికు, 3000 మీటర్ల పరుగులో బి.వెంకటలక్ష్మికు రజిత పతకాలు సొంతంచేసుకున్నారు.ట్రిపుల్‌జంప్‌లో బి.హారికకు రజితం,లాంగ్‌జంప్‌లో కాంస్యం, జావెలిన్‌లో ఎస్.రోహిత్‌కు కాంస్యం, 4 ఇంటు100 మీటర్ల రిలేలో రజితం, డిస్కస్ త్రోలో భాను కాంస్యపతకాలు సొంతం చేసుకున్నారు. క్రీడాకారులు, టీమ్‌కు కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరించిన కె.రాజారావు, ఇ.అప్పన్నలకు జిల్లా అథ్లెక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కెమధుసూదనరావు, ఎం.సాంబమూర్తిలు అభినందించారు.


చాంపియన్‌షిప్‌కు కైవశం చేసుకున్న జిల్లా బాలికలు

సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

సోంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సారా తయారుచేస్తున్న గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నవోదయం-2లో భాగంగా సారా తయారీ దారులపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు.బుధవారం సోంపేట స్టేషన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్, సోంపేట, పలాస సీఐలు జీవీ రమణ, ఐ.మల్లిఖార్జునరావు, టాస్క్‌ఫోర్స్ సీఐ మధు, ఎస్ఐలు కళ్యాణి, సూజత సిబ్బంది ఉన్నారు.

కోటిపల్లి పాఠశాలకు కుళ్లిన కోడి గుడ్లు సరఫరా

పొందూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):కోటిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఏజెన్సీ నిర్వాహకులు కుళ్లిపోయి, పురుగులు పట్టి దుర్వాసన వచ్చిన కోడిగుడ్లు సరఫరాచేశారు. పదిరోజుల కిందట ఇవ్వాల్సిన గుడ్లను బుధవారం ఏజెన్సీ సరఫరాచేసింది. నాణ్యతలేనివి సరఫరా చేయడంతో కుళ్లిపోతున్నాయని ఉపాధ్యాయుడు జి. చల్లన్నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారులకు తెలియజేశామని చెప్పారు.

అర్జునాపురంలో వరుణ యాగం

కంచిలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని అర్జునాపురం బుద్దగిరి కొండ వద్ద బుధవారం వరుణ యాగం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు కురవాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

నరసన్నపేట సబ్‌జైలు పరిశీలన

నరసన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా జైలులోని ముద్దాయిలతో మాట్లాడారు. ఆహారం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

డీఏను విడుదల చేయాలి

ఆమదాలవలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏను విడుదల చేయాలని టీడీపీ నేత, విశ్రాంత తహసీల్దార్ కోరారు.శ్రీహరిపురంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల అభ్యుదయానికి దోహదపడుతున్నాయని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు అప్పలనాయుడు, సనపల రమణారావు పాల్గొన్నారు.

బూరగాంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచిలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): బూరగాంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. మంగళవారం రాత్రి పది గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటి వరకు కొత్తది ఏర్పాటుచేయకపోవడంతో చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. శ్రీకాకుళం నుంచి తీసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 11 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేయడానికి ఈనెల 20లోగా దరఖాస్తులు చేయాలని విద్యాలయం ప్రిన్సిపాల్ బి.బేతన సామి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ప్రవేశానికి అర్హులని తెలిపారు. కాగా జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తు గడువు ఈనెల 27 వరకు పెంచినట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

రైల్వే నిలయంలో సమస్యల పరిష్కారానికి హామీ

ఇచ్ఛాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైల్వే నిలయంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ సభ్యుడు కట్టా సూర్య ప్రకాష్ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఖుర్దా డివిజన్ డీఆర్ఎం కార్యాలయంలో జరిగిన డీఆర్‌యూసీసీ మొదటి సమావేశంలో డీఆర్‌యూసీసీ చైర్మన్ డీఏఎం అలోక్ త్రిపాఠి, సెక్రటరీ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిల్ కుమార్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కొత్తగా నిర్మిస్తున్న 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పడమర వైపు పొడిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇక్కడ ప్రధాన రైళ్ల హాల్టింగ్‌కు చేసిన సిఫార్సు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీలో 'కిశోరీ వికాసం'

ఇచ్ఛాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం కేజీబీవీ పాఠశాలలో బుధవారం కిశోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు విడనాడాలని, మత్తు పదార్థాలకు బానిస కావద్దని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్గరిథమ్స్‌పై వర్క్‌షాపు

ఎచ్చెర్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డేటా స్ట్రక్చర్ అండ్ ఆల్గరిథమ్స్ విత్ పైతాన్‌అన్న అంశంపై పదిరోజులపాటు నిర్వహించిన వర్క్‌షాపు బుధవారం ముగిసింది. హైదరాబాద్‌లోని బ్రెనో విజన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో నలుగురు రిసోర్స్ పర్సన్లు విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంపై అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో 42 యాప్‌లను విద్యార్థులతో రూపొందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, రిసోర్స్‌పర్సన్ సాయి పవన్ హెచ్‌వోడీలు జగదీష్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం సహకారం

కవిటి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం సహకరిస్తోందని కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, పీఏసీఎస్ చైర్మన్ బానుదేవ్ ప్రదాన్ తెలిపారు. బుధవారం కవిటిలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం నిధులను రాష్ట్రప్రభుత్వం జమచేయడంతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పి.కృష్ణారావు ఆధ్వర్యంలోలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, ఎస్‌వీరమణ, పి.సంతోష్, ఎ.మధు, బి.కామరాజు, వి.రంగారావు, బి.చక్రదర్, మణిబాబు పాల్గొన్నారు.


కవిటిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు











శిథిలం..

వజ్రపుకొత్తూరులోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. 2006లో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. శ్లాబ్, గోడలు పెచ్చులూడి భయానకంగా కనిపిస్తోంది. దీంతో సిబ్బందితో పాటు పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. 'భవనం దుస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. మరో భవనం లేక పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నాం.' అని మండల పశువైద్యాధికారి మెట్ట పాపారావు అన్నారు. -వజ్రపుకొత్తూరు



శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

అసంపూర్తిగా..




అసంపూర్తిగా ఉన్న రన్నింగ్ ట్రాక్

నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రన్నింగ్ ట్రాక్ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. పీఎం శ్రీ పథకం కింద విద్యార్థుల సౌకర్యార్థం ఈ పాఠశాలకు రన్నింగ్ ట్రాక్ మంజూరైంది. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తికాలేదు. ఉన్నత పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల కూడా ఇదే ప్రాంగణంలో ఉన్నప్పటికీ ఆటస్థలం లేక తర్ఫీదు పొందేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రన్నింగ్ ట్రాక్‌ను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చి క్రీడలకు ప్రోత్సహించాలని విద్యార్థులు కోరుతున్నారు. -నందిగాం

నిరుపయోగం

మందస మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఇందిరా క్రాంతి భవనం నిరుపయోగంగా ఉంది. 2007లో దీన్ని నిర్మించి అధికారులు ప్రారంభించారు. మండల సమాఖ్య భవనంగా కొన్నాళ్లు వినియోగించుకున్నారు. కొత్త భవనం నిర్మించిన తరువాత ఇందిరా క్రాంతి కార్యాలయాన్ని అందులోకి మార్చారు. పాతభవనాన్ని వదిలేయడంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది. -మందస



మందసలో నిరుపయోగంగా ఉన్న ఇందిరా క్రాంతి భవనం

రోడ్డుపైనే చెత్త



రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త

కొత్తూరు రెల్లివీధికి ఎదురుగా ఉన్న పాతరెవెన్యూ కార్యాలయం రహదారికి ఇరువైపులా స్థానికులు చెత్తను పారబోస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ఉన్న బీసీ బాలురు, బాలికల వసతి గృహాల విద్యార్థులు, పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ప్రతిరోజూ ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రహదారిపై ఎటువంటి విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై పేరుకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. -కొత్తూరు

మహిళ ఆత్మహత్య

కోటబొమ్మాళి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తిలారు గ్రామానికి చెందిన సవర లావణ్య (22) బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె తండ్రి పల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ వంగపండు సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ పొన్నానపేట గ్రామానికి చెందిన లావణ్యకు తిలారు గ్రామానికి చెందిన సవర రాజారావుతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 14న వీరి పెళ్లి రోజు. దీంతో చీర కొంటానని లావణ్యకు భర్త రాజారావు చెప్పగా.. అందుకు ఆమె అలిగి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె చిన్నచిన్న విషయాలకు అలగటం చిన్నప్పటి నుంచి అలవాటేనని.. మా అల్లుడు, కుటుంబసభ్యులంతా మంచివారేనని లావణ్య తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమెకు భర్తతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మునసబుపేట వద్ద గల కేంద్రీయ విద్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాల మేరకు.. గార మండలం కల్లివలస గ్రామానికి చెందిన వెలమశెట్టి ఆదినారాయణ (64) సైకిల్‌పై జాతీయ రహదారి పైనుంచి పెద్దపాడు వైపు వెళ్తుండగా.. ఇదే సమయంలో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆదినారాయణను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

నరసన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులతో పాటు విక్రయిస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12న సూరజ్‌నగర్ సమీపంలో మణి, మోహన్ అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ వారిని పట్టుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. నరసన్నపేట పట్టణంతోపాటు పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్న పర్లాకిమిడి చెందిన సంజుని గుర్తించారు. సత్యవరం జంక్షన్ వద్ద పోలీసులను చూసి తప్పించుకునేందుకు సంజు ప్రయత్నించగా.. పట్టుకొని బ్యాగ్ తనిఖీ చేయగా 20 కిలోల గంజాయిని గుర్తించారు. అలాగే మడపాం టోల్ ప్లాజా వద్ద 4.5 కిలోల గంజాయిని తీసుకువెళ్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షగాళ్లగా తిరిగి.. తాళం వేసిన ఇళ్లను గుర్తించి..

- దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



అనుమానితులతో పోలీసులు

సోంపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సోంపేట, బారువ పరిసరాల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ముఠా చంటిపిల్లలతో భిక్షగాళ్లగా తిరిగి తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతోంది. ఈ మేరకు బారువ పోలీసులకు ఆ ముఠా పట్టుబడింది. సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు కథనం మేరకు.. కొర్లాం గ్రామానికి చెందిన తూగా బాలమ్మ, గార వాణి ఇళ్లకు తాళం వేసి ఉండడంతో జూలై 28న ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్యలో కొందరు దొంగతనానికి పాల్పడ్డారు. బాలమ్మ ఇంట్లో అరతులం బంగారం, రూ.7000 కలిపి మొత్తం రూ.30000, వాణి ఇంట్లో ఆర తులం బంగారం చైన్, రెండు జతల బంగారు చెవి దిద్దులు, జత సిల్వర్ పట్టీలు మొత్తం కలిపి రూ.14000 విలువచేసే వస్తువులు దొంగిలించారు. ఈ మేరకు వారిద్దరూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రధాన జంక్షన్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించారు. బుధవారం ఉదయం పది గంటల సమయంలో బారువ స్టేషన్ పరిధిలోని పాలవలస వద్ద ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించి వారిని పట్టుకొని విచారించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మోనిక సింగ్, సోయిదా సింగ్‌గా నిర్ధారించారు. తామే దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. ఈ మేరకు వారిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

రాహుల్‌గాంధీపై విమర్శలు తగదు

టెక్కలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత, సీడబ్ల్యూసీ సభ్యులు రాహుల్ గాంధీని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించడం తగదని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. బుధవారం టెక్కలిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నల్లారిని ముఖ్యమంత్రి చేసిందని, కనీసం ఆ కృతజ్ఞత కూడా లేకుండా రాహుల్ గాంధీపై విమర్శలు చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. దశాబ్దాలు కాలంగా ఏ పదవీ లేకుండా జోడోయాత్ర, న్యాయయాత్ర చేపట్టి ప్రజల సమస్యల్ని గుర్తించారని, ఈ దేశానికి కాంగ్రెస్ పార్టీయే శరణ్యమని ప్రజలు భావిస్తున్నారని ఆమె తెలిపారు.

గిరిజనుల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి

మెళియాపుట్టి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గిరిజనుల్లో సామర్థ్యం పెంపునకు కృషి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మెళియాపుట్టిలో ఆదికర్మ యోగి పథకంపై శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు ప్రాధాన్యం ఇచ్చే పనులు చేయాలని ఉద్దేశ్యంతో ఈ పథకం ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, గిరిజనుల ఆర్థిక అభివృద్ధి తీసుకోవాల్సి చర్యలపై అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు పాలన, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూ ఓ.సూర్యానారాయణ, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్ పండా పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

కాశీబుగ్గ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాశీబుగ్గలో క్విట్ కార్పొరేట్ డేను నిర్వహించారు. కాశీబుగ్గ పెట్రోల్ బంక్ నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ట్రాక్టర్, ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ.. రైతులకు నష్టకరమైన మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాల రద్దు చేయాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు పంటలు పండే రైతుల భూములు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మించి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించాలన్నారు. అటవీ హక్కుల చట్టం 1/70 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రతినిధులు రామారావు, గణపతి, సన్యాసిరావు, అజయ్‌కుమార్ భాస్కరావు, వాసు, దుష్యంత్, ఆనందరావు, రవి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

కోటబొమ్మాళి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు ఇప్పటి వరకు రాని రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని టెక్కలి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలో గల రేగులపాడు గ్రామంలో ఏవో ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులు సాగుచేస్తున్న వరి, వేరుశనగ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణపై వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కలతోనే భావితరాలకు భవిష్యత్తు

హరిపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే భావితరాలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. మందస మండలం బాలిగాం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బాదం, వేపతోపాటు పది రకాల పూల మొక్కలను నాటి సంరక్షణ బాధ్యతను ఒక్కో విద్యార్థికి అప్పగించారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరికీ మొక్కల సంరక్షణ, ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్ పాత్రో, నగిరి లక్ష్మి, యానాది సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మందస, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ అన్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు భద్రత-మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన చేపట్టారు. విద్యార్థినులు మహిళా చట్టాలు, వాటి సంరక్షణ, సోషల్ మీడియాలో గల ఆంక్షలపై తెలుసుకోవాలని, ఎవరైనా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు, పోలీసులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- సంతబొమ్మాళి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. బుధవారం రాత్రి సంతబొమ్మాళిలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలుగే అనార్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర ప్రతినిధి కె.మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలిబాటల ఏర్పాటుతో ప్రయోజనం

జలుమూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగులో కాలిబాటలు ఏర్పాటుతో ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌వీ మధు తెలిపారు. కొమనాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తూర్పు, పడమరులుగా రెండేసి మీటర్ల దూరంలో ఒక్కో కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల ఎరువులు వేసుకోడానికి వీలుగా ఉండడంతోపాటు చీడపీడలు బెడద తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.రవికుమార్, పలువురు రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం వితరణ

జలుమూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థి వైద్యభూషణ జగన్నాథరావు సౌండ్ సిస్టం వితరణగా హెచ్‌ఎం మెండ రామారావుకు బుధవారం అందించారు. పాఠశాలలో సమావేశాలు, క్విజ్ పోటీలు, ఆటలు పోటీలు నిర్వహణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

పాఠశాలకు బెంచీలు అందజేత

కొత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కురిగాం పాఠశాలకు వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ ఎనిమిది బెంచీలు అంజేశారు. విద్యార్థుల కిందన కూర్చొని చదువులు సాగిస్తుండడంతో వైద్య తనిఖీలకు వెళ్లిన ఆయన చలించి తమవంతుగా బెంచీలు అందజేశారు. పాఠశాలకు బెంచీలు అందజేయడంపై స్థానికులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన కార్పొరేషన్ చైర్మన్



కార్పొరేషన్ చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పొందరి, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దామోదర నరసింహం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే చైర్మన్‌గా ఎన్నికైనందుకు నరసింహంను ఎమ్మెల్యే అభినందించారు.

పాతపట్నం సబ్‌జైలు సందర్శన

పాతపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సబ్ జైలును లీగల్ సర్వసెస్ జిల్లా కార్యదర్శి కె.హరిబాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌జైలు ఖైదీలతో మాట్లాడుతూ.. ఉచిత న్యాయసేవలు కావాలంటే అడగాలన్నారు. అలాగే సబ్‌జైలులో మెనూ నిర్వాహణ ఆరోగ్య సేవలపై ప్రశ్నించారు. అనంతరం జూబిలీ రోడ్‌లో గల నవజీవన్ వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థినులకు మహిళా భద్రతా చట్టాలపైనా పోక్సో చట్టంపైన అవగాహన కలిగించారు. జుడీషియల్, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.

పరిమితంగా ఎరువులు వాడాలి

ఎల్ఎన్ పేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాలకు పరిమిత స్థాయిలో ఎరువులు వాడాలని కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి రాజగోపాలరావు సూచించారు. బుధవారం సుమంతపురంలో జరిగిన పొలంపిలుస్తుంది కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ.. పంటపొలాలకు యూరియా, నానో డీఏపీ మాత్రమే వాడాలని ప్రతీ రైతు పంట నమోదు చేసుకొవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పావని, బి.పద్మజ, సర్పంచ్ నరిసింహంలునాయుడులు పాల్గొన్నారు.

బోరు బాగు చేయండి



మరమ్మతులకు గురైన బోరు

హిరమండలం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హిరమండంలోని బ్యారేజీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న బోరును బాగు చేయాలని స్థానికులు కొరుతున్నారు. కొత్తూరు, పాతపట్నం, శ్రీకాకుళం వేళ్లేందుకు ప్రధాన కూడలి అయిన ఇక్కడ ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు బస్సులు, ఇతర వాహనాల కోసం వేచి చూస్తుంటారు. ఈ ప్రాంతంలో ఒకే బోరు ఉండటం అదీ ఏడాదిన్నర కాలంగా మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

కూర్మ గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు

హిరమండలం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూర్మ గ్రామంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హరే రామ సంకీర్తనలు, శ్రీకృష్ణ భగవాన్‌కు హారతులు, ప్రవచనాలు నాటక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందిస్తామన్నారు.

కిచెన్ గార్డెన్లు పెంచాలి

నరసన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు సూచించారు. బుధవారం సత్యవరం, ఉకలాం పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించే అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు.

20లోగా నమోదు చేసుకోవాలి

నందిగాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దిమిలాడ, తెంబూరు పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులు ఈ నెల 20వ తేదీలోగా పంటల బీమా చెల్లించి నమోదు చేసుకోవాలని ఆయా పీఏసీఎస్‌ల సీఈవోలు పోలాకి శ్రీనుబాబు, ఎన్.దాసు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరానికి రూ.160 చొప్పున్న పంటల బీమా కింద చెల్లించాలని, దీనికి గాను రైతులు 1బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా జెరాక్స్ కాపీలతో నర్సిపురం, లట్టిగాంల్లోని కార్యాలయాలకు అందించాలని కోరారు.

నేడు అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



జలుమూరు (సారవకోట), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కోదడ్డపనస కొండపై వెలసిన స్వయంభువ అయ్యప్పస్వామి వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురుస్వామి సుబ్బారావు నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అంగన్‌వాడీల జీతాలు పెంచాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో సీఐటీయూ నాయకులు

కొత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీలతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారే తప్పా జీతం మాత్రం పెంచడం లేదని, పెండింగ్‌లో ఉన్నసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపటం లేదని ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ నాయకలు శిర్ల ప్రసాదరావు, అంగన్‌వాడి యూనియన్ నాయకలు ధనలక్ష్మి, అనూరాధ, అమ్మాయమ్మ, శ్రీలత, విజయ, భవాని తదితరలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తన భర్త అదృశ్యమయ్యాడని భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని కృష్ణాపార్క్ వద్దగల పుణ్యపువీధిలో వారణాసి చిరంజీవి (38) వడ్డీ వ్యాపారం చేస్తూ భార్య జయశ్రీతో కొన్నేళ్లుగా జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా చిరంజీవి ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంటిలో ఉన్న తన భార్య జయశ్రీకు బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. ఎప్పటికీ రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. భర్త ఆచూకీ లభించకపోవడంతో జయశ్రీ బుధవారం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

సినీ ఫక్కీలో చోరీ

పార్వతీపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణ శివారు నిర్వాసిత కాలనీ సమీపంలో పార్వతీపురం-శ్రీకాకుళం రహదారిపై సినీ ఫక్కీలో బుధవారం చోరీ జరిగింది. పార్వతీపురంలో కొందరు వ్యక్తులు ఎక్కువ ఖరీదు చేసే బంగారాన్ని తక్కువ ధరకు ఇస్తున్నారని శ్రీకాకుళం జిల్లా రాగోలు గ్రామానికి చెందిన పొట్లూరు శ్రీలక్ష్మి అనే ఉపాధ్యాయినికి తన పూర్వ విద్యార్థి రిషికుమార్ చెప్పాడు. దీంతో బుధవారం సాయంత్రం రూ.12 లక్షల నగదుతో రాగోలు నుంచి శ్రీలక్ష్మి, రిషికుమార్ కలిసి ద్విచక్ర వాహనంపై పార్వతీపురం పట్టణ శివారుకు వచ్చారు. కొంతసేపు తరువాత ఒడిశా రిజిస్ట్రేషన్ కలిగిన కారులో కొంతమంది వ్యక్తులు వారి వద్దకు వచ్చారు. ముందు నగదు చూపించాలని, తర్వాత బంగారం ఇస్తామని వారు చెప్పారు. దీంతో శ్రీలక్ష్మి, రిషికుమార్ తమ వద్దనున్న నగదును చూపిస్తుండగా, బలవంతంగా వారి దగ్గర నుంచి నగదు సంచిని లాక్కొని కారులో పార్వతీపురం పట్టణం వైపు ఆ వ్యక్తులు వెళ్లిపోయారు. దీనిపై బాధితులు పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోషి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

థైలేరియా వ్యాక్సిన్లు సిద్ధం

టెక్కలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్ని పశువైద్య కేంద్రాల్లో థైలేరియా వ్యాక్సిన్ 29,685 డోసులు సిద్ధంగా ఉంచామని ఆ ఉపసంచాలకులు డాక్టర్ చందక నర్సింహులు తెలిపారు. బుధవారం ఆయన టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పశుపోషణపై ఆధారపడిన రైతులను దృష్టిలో ఉంచుకొని టీకా పంపిణీ ముమ్మరం చేస్తున్నామన్నారు. పశువుల్లో తీవ్రమైన జ్వరం, బరువు తగ్గిపోవడానికి మరణానికి కూడా దారితీస్తాయని, ఈ టీకా వేయడం ద్వారా కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రవికృష్ణ, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

టెక్కలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ చేరివీధి, అంజనాపురం లే అవుట్లలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు మంజూరు కోసం అర్హులైన వారి నుంచి ఈనెల 31వ తేదీలోగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్‌లు సమర్పించాలన్నారు.

నేడు భారీ ట్రాక్టర్ల ర్యాలీ

కోటబొమ్మాళి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవలో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయం నుంచి కోటబొమ్మాళి ఏఎంసీ కార్యాలయం వరకు భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నట్టు మంత్రి పొలిటికల్ పీఏ లాడి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

నకిలీ కరెన్సీ గుట్టురట్టు

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని డే అండ్‌నైట్ కూడలిలోని ఓ లాడ్జీలో నకిలీ కరెన్సీ మారుస్తున్న ఇద్దరి వ్యక్తులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సీసీఎస్ పోలీసుల కథనం మేరకు.. సోంపేటకు చెందిన శ్రీనివాసరావు, గార మండలం లింగాలవలసకు చెందిన మరో వ్యక్తి సత్యనారాయణ లాడ్జీలో గట్టుచప్పుడు కాకుండా రూ.200 నోట్లు చెలామణి చేసేందుకు ప్రయత్నించారు. లాడ్జీ బాయ్‌కి ఒక రెండు వందల రూపాయి నోటు ఇచ్చి పాన్‌షాపునకు వెళ్లి కూల్ డ్రింక్, తిను బండారాలు తీసుకురావాలని కోరారు. సదరు బాయ్ దుకాణానికి వెళ్లి కొనుగోలుకు ప్రయత్నించగా దుకాణదారుడు నకిలీనోటు అని గుర్తించి సీసీఎస్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో లాడ్జీలోని ఉన్న వారిద్దరి అరెస్టు చేశారు.

ఏటీఎం పనిచేయక అవస్థలు

నందిగాం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఏకైక ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయకపోవడంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. మండల కాంప్లెక్స్‌కు సమీపాన జాతీయ రహదారికి ఆనించి ఏటీఎం ఉండడంతో వివిధ పనులపై వచ్చే ఖాతాదారులకు, వాహనదారులకు ఈ ఏటీఎం ఎంతగానో ఉపకరిస్తుంది. అటువంటి ఇప్పుడు రోజుల తరబడి పనిచేయకపోవడంతో ఖతాదారులంతా ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.